సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



చిచ్చు రేపిన డీలర్ ఉద్యోగం

ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా అలజడి రేగింది. జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య చెలరేగిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది.

- 8లో



సిరిమాను చెట్టు ఊరేగింపు

సాలూరు పట్టణంలో మే నెలలో జరగనున్న శ్రీ శ్యామలాంబ తల్లి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- 8లో



'చీకటి పువ్వు'కు బహుమతి

ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది.

- 8లో

న్యూస్‌రీల్

పల్లెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



వెంకంపేటలో చెత్తసేకరణ పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

పార్వతీపురం రూరల్: పల్లెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. మండలంలోని వెంకంపేటలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 451 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ కార్యక్రమం సాగుతుందన్నారు. శని, ఆదివారాల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ చేసి సంపద తయారు చేసే కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సేవలను, గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలను వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో రెండు రోజుల్లో 8,500 కిలోల తడి చెత్తను, 5,500 కిలోల పొడి చెత్తను సేకరించినట్టు పేర్కొన్నారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు.

గిరిశిఖర గర్భిణుల వసతిగృహ సందర్శన



రికార్డులను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం అధికారులు

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.టి.జగన్‌మోహన్ రావు, డా.పి.ఎల్.రఘు ఆదివారం సందర్శించారు. గర్భిణులకు అందుతున్న సదుపాయాల తదితర అంశాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. వారికి అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహారం తదితర విషయాలను తెలుసుకుని, ఏమైనా సమస్యలున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది గర్భిణులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం నిర్మాణమవుతున్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట వైటీసీ మేనేజర్ విద్యాసాగర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- త్వరలో సీఎంను కలుస్తాం
- విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



ప్రసంగిస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ

విశాఖ–లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారంగా ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు ఏర్పాటు సంబంధించి న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టు మెంట్ సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏపీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

గ్రూప్ - 2 మెయిన్స్‌కు
తగ్గిన హాజరు శాతం

గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు ఆశించిన స్థాయిలో అభ్యర్థులు హాజరు కాలేకపోయారు. దీనికి ప్రభుత్వ తీరే కారణమని పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు. చివరి క్షణం వరకు పరీక్ష జరుగుతుందో.. లేదోనన్న సందిగ్ధత వల్లే హాజరు కాలేకపోయారని ఇటు అభ్యర్థులు, అటు వారి తల్లిదండ్రులు ప్రభుత్వ తీరును తప్పు పడుతున్నారు.





పరీక్ష కేంద్రంలోకి వెళ్లే అభ్యర్థులకు తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

- చివరి వరకూ అభ్యర్థుల్లో గందరగోళం
- ప్రశాంతంగా ముగిసిన పరీక్ష
- అభ్యర్థుల హాజరు శాతం 84.69 మాత్రమే..
- కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్/గంటస్తంభం:

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ - 2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అయితే అభ్యర్థుల హాజరు శాతం తగ్గింది. పరీక్షకు 84.69 శాతం అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన వారికి ఒక పోస్టుకు వంద మంది వంతున ఈ పరీక్షకు ఏపీపీఎస్సీ ఎంపిక చేసింది. నిజానికి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన వారు మెయిన్స్‌కు హాజరు కాకపోవడం సహజంగా ఉండదు. కానీ జిల్లాలో సుమారు 16 శాతం మంది అభ్యర్థులు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. కొద్ది రోజులుగా ఈ పరీక్షల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతత వల్ల ఈ పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చివరి క్షణం వరకు పరీక్ష వాయిదా పడుతుందని, దానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడంతో దూర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులు అలా ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. అయితే పరీక్ష వాయిదా పడదు.. ఆ వార్త ఫేక్.. పరీక్ష యథావిధిగా జరుగుతుందని ఒక్క రోజు ముందు పబ్లిక్ కమిషన్ ప్రకటించింది. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న అభ్యర్థులు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో హాజరు శాతం తగ్గిందని అభ్యర్థులు పేర్కొన్నారు. విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లోని శిక్షణ పొందుతూ విజయనగరంలో పరీక్ష కేంద్రాలున్న అభ్యర్థులు రావడానికి శనివారం రాత్రికి రాత్రి ఇబ్బంది పడ్డారు. గాజులరేగకు చెందిన ఒక అభ్యర్థి హైదరాబాద్ నుంచి శనివా రం రాత్రి 11.30గంటలకు విజయనగరం చేరుకొని స్థానిక మహారాజా కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష రాశారు. ఇలా ఇబ్బంది పడి పరీక్షకు హాజరైన వారు అన్ని కేంద్రాల్లో కనిపించారు.

అభ్యర్థుల హాజరు శాతం 84.69 మాత్రమే...

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 12 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ - 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు పేపర్లకు ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మెయిన్స్‌కి అర్హత పొందిన 6,265 మంది అభ్యర్థులలో 84.69 శాతంతో 5,306 మంది పరీక్షకు హాజరయ్యారు. గైర్హాజరు అయిన వారు 959 మంది ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగాయి. పట్టణంలోని జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ, సీతం ఇంజనీరింగ్ కేంద్రాలను సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ పరిశీలించారు. ఆయనతో పాటు డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీస్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సమాయత్తం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎంఓలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుందన్నారు. ఈ ఎన్నికలకు 2,333 మంది ఉపాధ్యాయ ఓటర్లు నమోదు కాగా, అందులో పురుషులు 1,574 మంది, మహిళలు 759 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా పార్వతీపురంలో 636, పాలకొండలో 301, సాలూరులో 250 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా పాచిపెంటలో 34 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 15 మండలాల్లో జరిగే ఈ ఎన్నికల కోసం ఇప్పటికే (20 శాతం రిజర్వుతో కలిపి) 18 మంది ప్రిసైడింగ్ అధికారులు, 18 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 36 మంది ఇతర పోలింగ్ అధికారులు, 18 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ఈ నెల 18వ తేదీన పీఓలు, ఏపీఓలకు తొలి విడత శిక్షణ ఇవ్వడం జరిగిందని, రెండో విడత శిక్షణ సోమవారం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పీఓలు కీలక పాత్ర వహించాల్సి ఉంటుందన్నారు.

పూర్తి బాధ్యత వహించాలి

ఎన్నికల సామగ్రి స్వీకరించినప్పటి నుంచి బ్యాలెట్ బాక్సులు అప్పగించేంత వరకు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెల్పి చెప్పారు. పోలింగ్ ముందురోజున పార్వతీపురం కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఉంటుందని, చెక్ లిస్ట్ మేరకు వాటిని పరిశీలించుకోవాల్సిన బాధ్యత పీఓలపై ఉందన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాను ఆరు జోన్లగా విభజించడం జరిగిందని, అవసరం మేరకు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పీఓలకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్‌తో ఇతర ఏర్పాట్లను ముందుగా పరిశీలించుకోవాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో తలెత్తే సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పీఓలదేనని కలెక్టర్ ఉద్ఘాటించారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రాష్ట్రంలో చంద్రన్న పగ, దగా పథకాలే..



వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన కురసాల కన్నబాబుకు అభినందనలు తెలుపుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అధ్యక్షులు తదితరులు

- కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- గ్రూప్–2 అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారు
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చంద్రన్న పగ.. చంద్రన్న దగా సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేసిన పాపానపోలేదని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా బృహత్తరమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర అంటే ఉద్యమాలకు పురిటి గడ్డలాంటిదని, ఈ ప్రాంత ప్రజలు ఉద్యమిస్తే.. సాధించేవరకూ పట్టువదలరని కొనియాడారు. అలాంటి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్నివిధాలా తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వారిచ్చిన ప్రతి హామీని అమలుచేసేలా ప్రజల తరఫున పోరాడుతుందని పేర్కొన్నారు. కూటమి 8 నెలల పాలనలో రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిన సీఎం చంద్రబాబు.. ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సేనల కన్నా వైఎస్ జగన్ సేన స్ట్రాంగ్‌గా ఉందని, ఆయన కోసం ప్రాణాలు ఇచ్చే కోట్లాది మంది కార్యకర్తలు, ప్రజలు, అభిమానులున్నారన్నారు. వైఎస్ జగన్ అంటే ఒక శక్తి.. ఆయన చాలా స్ట్రాంగ్ అని స్పష్టం చేశారు. ప్రజలే మా బలమన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రానా ఎటువంటి నష్టం లేదన్నారు.

గ్రూప్–2 అభ్యర్థుల యువగళం చూశాం

ఎన్నికలకు ముందు లోకేష్ యువగళమంటూ తిరిగాడు.. అసలు సిసలైన యువగళం విశాఖ కేంద్రంగా గ్రూప్–2 అభ్యర్థులు చేశారని కన్నబాబు అన్నారు. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేస్తామంటూ నమ్మించి అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగులనే కాదు.. మహిళలు, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజరాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, పీవీ సురేష్, సాడి పద్మారెడ్డి, ఇమ్రాన్, ముఖ్యనేతలు కోలా గురువులు, రొంగల జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పేర్ల విజయచందర్, కాయల వెంకటరెడ్డి, పేడాడ రమణికుమారి, మారుతీప్రసాద్, బోని శివరామకృష్ణ, శ్రీదేవి వర్మ, మాధవివర్మ, పీలా వెంకటలక్ష్మి, కాళిదాస్‌రెడ్డి, సనపల రవీంద్ర భరత్, అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కళా ఇది నీకు తగునా..!

- యథేచ్ఛగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- ప్రభుత్వ అధికారుల సీట్లలో కూర్చొని దర్జాగా ప్రచారం

గుర్ల: ఎమ్మెల్యే కమిడి కళావెంకటరావు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. వివరాల్లోకి వెళ్తే.. గుర్ల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కళా వెంకటరావు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా శనివారం ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రచారంలో ఎమ్మెల్యే కోడ్‌ను ఉల్లంఘించి హైస్కూల్ హెచ్‌ఎం, కళాశాల ప్రిన్సిపాల్ సీట్లలో కూర్చొని ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నికల్లో రఘువర్మకు ఓటు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కళా వెంకటరావు ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై మాజీ ఎమ్మెల్సీ అజశర్మ విశాఖపట్నంలోని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కళావెంకటరావుపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



గుర్ల హైస్కూల్ హెచ్‌ఎం కుర్చీలో కూర్చొని ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పాడి రైతు కుదేలు...!

- కూటమి పాలనలో సిండికేట్ అయిన డెయిరీలు
- పాల ధరలను లీటరుకు రూ.8 నుంచి రూ.10లు తగ్గించేసిన డెయిరీలు
- ఆవు పాలు మాత్రమే కొనుగోలు
- గేదె పాలు వద్దే..వద్దు..



వీరఘట్టం మండలంలో ఓ డెయిరీలో పాలు ఇస్తున్న పాడి రైతులు

వీరఘట్టం: మార్కెట్‌లో ప్రస్తుతం ఒక లీటరు వాటర్ బాటిల్ ఖరీదు రూ.20 ఉంది. అదే బ్రాండెడ్ వాటర్ బాటిల్ ధర లీటరు రూ.50 లు. పాడి రైతు విక్రయించే పాల ధర మాత్రం కేవలం రూ.34లకు మాత్రమే డెయిరీలు కొనుగోలు చేస్తున్నాయి. ఇదేంటని డెయిరీ యాజమాన్యాన్ని రైతులు అడిగితే పాలలో వెన్న శాతం తగ్గుతుండడంతో పాలకు డిమాండ్ తగ్గిందని అందుకే గిట్టుబాటు ధర ఇవ్వలేమని చెప్పి పాడి రైతులను డెయిరీలు నిలువునా ముంచేస్తున్నాయి. దీంతో చేసిది ఏమీ లేక డెయిరీలు నిర్ణయించిన ధరకే పాలను విక్రయిస్తూ పాడి రైతులు లబోదిబోమంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ఎనిమిది నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతు పరిస్థితి ఇలానే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డెయిరీలు సిండికేట్‌గా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు అండగా నిలిచి పాల ధరలను లీటరుకు రూ.6లు పెంచారు. దీంతో గత ఐదేళ్లుగా పాడి రైతులు లీటరు పాలను రూ.46ల చొప్పున డెయిరీలకు విక్రయించి అధిక లాభాలు పొందారు. ప్రభుత్వం మారడంతో పాడి రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

ఇదీ పరిస్థితి


పార్వతీపురం మన్యం జిల్లాలో 2.70 లక్షల పశు సంపద ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ఆవులు, గేదెలు 1.62 లక్షలు ఉండగా వీటిలో 60 శాతం మాత్రమే అనగా 97 వేలు మాత్రమే పాలిచ్చే ఆవులు, గేదెలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మేలు జాతి పశువులు కావడంతో రోజుకు సరాసరిన 7.76 లక్షల లీటర్లు పాల ఉత్పత్తి వస్తోంది. ఇందులో ఇంటి వాడుకలకు, ఇతర అవసరాలకు పోను ప్రతీ రోజు జిల్లాలో ఉన్న వివిధ డెయిరీలకు 6 లక్షల లీటర్ల పాలను పాడి రైతులు అందజేస్తున్నారు. గత ఎనిమిది నెలల క్రితం వరకు ఈ లెక్కల ప్రకారం రోజుకు రూ.6 లక్షల లీటర్లు పాలను డెయిరీలకు ఇచ్చేవారు. ఇప్పుడు డెయిరీలు డిమాండ్ లేదని చెప్పి పాల ధరలను రూ.8 నుంచి రూ.10ల వరకు తగ్గించేశాయి. పాల కొనుగోలును కూడా తగ్గించేశాయి. జిల్లాలో రోజుకు 3 లక్షల లీటర్ల పాలను మాత్రమే వివిధ డెయిరీలు కొనుగోలు చేస్తున్నాయి. పాల ఉత్పత్తిలో సగం పాలను మాత్రమే డెయిరీలు కొనుగోలు చేయడంతో మిగిలిన పాలను ఏం చేయాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఏం జరుగుతోంది..

పాడి రైతుల వద్ద పాలను రూ.34లకు కొనుగోలు చేస్తున్న డెయిరీలు మార్కెట్‌లో మాత్రం వారి బ్రాండ్లతో లీటరు పాలను రూ.60లకు విక్రయిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డెయిరీలు పోటీ పడి ప్రత్యేక రాయితీలు ఇచ్చి పాడి రైతును ప్రోత్సహించేవారు. పాల ఉత్పత్తిని శతశాతం కొనుగోలు చేసేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పక్క రాష్ట్రాలకు వెళ్తున్న పాల ఎగుమతులను డెయిరీ కంపెనీలు నిలిపివేశాయి. డెయిరీలన్నీ సిండికేట్‌గా మారి రాష్ట్రంలో పాలకు డిమాండ్ తగ్గిందనే ప్రచారం చేపట్టారు. ఇలా పాలకు డిమాండ్ లేదని కొద్ది రోజులు చెప్పి తర్వాత తక్కువ ధరకే పాలను కొనుగోలు చేసేందుకు డెయిరీలు వేస్తున్న ఎత్తుగడ ఇదని పాడి రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం పాడి రైతును నట్టేట ముంచుతోందని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో పశు సంపద	ఆవులు, గేదెలు	పాలిచ్చే ఆవులు, గేదెలు	జిల్లాలో వీటి ద్వారా రోజుకు వస్తున్న పాలు	వాడుకలకు పోను ప్రతీ రోజు డెయిరీలకు ఇస్తున్న పాలు
2.70 లక్షలు	1.62 లక్షలు	97 వేలు	7.76 లక్షల లీటర్లు	6 లక్షల లీటర్లు

బయట వాళ్లకు విక్రయిస్తున్నా..



నా వద్ద మూడు ఆవులు ఉన్నాయి. రెండు పూటలా 15 లీటర్ల పాలు ఇస్తున్నాయి. పాలలో వెన్న శాతం తక్కువగా వస్తోందని చెప్పి డెయిరీ వాళ్లు పాల ధర తగ్గించేశారు. మీటరులో వచ్చే రీడింగ్‌ను బట్టి లీటరుకు రూ.32ల నుంచి రూ.34 వరకు ఇస్తున్నారు. దీంతో వారికి రోజుకు 5 లీటర్ల పాలనే ఇస్తున్నాను. మిగిలిన 10 లీటర్ల పాలను బయట వాళ్లకు లీటరు రూ.50 చొప్పున విక్రయిస్తున్నాను.

– వావిలపల్లి హరిబాబు, పాడి రైతు, ధశుమంతపురం, వీరఘట్టం మండలం


నెలకు రూ.3 వేలు వస్తోంది



ఒకప్పుడు లీటరు పాలు రూ.44 నుంచి రూ.46లకు డెయిరీలో కొనేవాళ్లు. ఇప్పుడు రూ.33లు మాత్రమే లీటరుకు ఇస్తున్నారు. రోజుకు నాలుగు లీటర్లు పాలకు గతంలో నెలకు రూ.5 వేలుకు పైగా డబ్బులు వచ్చేవి. ఇప్పుడు నెలకు మూడు వేలే వస్తోంది. దాణా, ఇతర ఖర్చులు పోను ఈ డబ్బులు కిట్టడం లేదు.

–గవర అప్పలస్వామి, పాడి రైతు, వీరఘట్టం మండలం

గేదె పాలు కొనరంట



డెయిరీలో ఆవు పాలే కొంటారంట. గేదె పాలు అక్కర్లేదట. డెయిరీ ఉందని ఆవులు, గేదెలు పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటున్నాం. ఇప్పుడు సడెన్‌గా గేదె పాలు మాకొద్దంటే ఎవరికి అమ్మాలో మీరే చెప్పండి. పాల ధరలను తగ్గించేసి పాడి రైతు శ్రమను డెయిరీలు దోచుకుంటున్నాయి.

– పారిశర్ల సంగమేషు, పాడి రైతు, వీరఘట్టం మండలం

గతంలో లీటరు పాలకు రూ.46 వచ్చేది



జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డెయిరీలో పాలను లీటరు రూ.46కు కొనేవారు. ఇప్పుడు ఎనిమిది నెలలుగా పాల రేటును డెయిరీలు తగ్గించేస్తున్నాయి. పశువుల దాణా తక్కువ రేటుకు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం పాల రేటు తగ్గుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు.

– వారాడ వెంకటరమణ, పాడి రైతు, యు.వెంకమ్మపేట, వీరఘట్టం మండలం

క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి

గుర్ల: మండలంలోని గరికివలస, ఆనంద పురం రోడ్డుపై గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఆదివారం దగ్ధమైంది. గరికివలస నుంచి భోగాపురం వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌కు ఆనంద పురం రోడ్డుపై ఉన్న విద్యుత్ వైర్లు తాకడంతో మంటలు చేలరేగాయి. సమాచారం మేరకు విజయనగరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆదుపుచేశారు. ఈ ప్రమాదంలో గడ్డి మొత్తం కాలిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటు వంటి గాయాలు కాలేదు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామం వద్ద గల బైపాస్ రోడ్డుపై ఒంపల్లి గ్రామానికి వెళ్లే జంక్షన్ వద్ద డివైడర్‌ను గజపతినగరానికి చెందిన బి.బాలు తన ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రమాదం గురించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



ఆనంద్ మృతదేహం

గంట్యాడ: మండలంలోని గింజేరు జంక్షన్ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి స్కూటీపై అల్లాడ ఆనంద్, కుమార్ రాజాలు, చెల్లూరుకు చెందిన దాసరి నారాయణరావు బైక్‌పై అదే రోడ్డులో వెళ్తుండగా గింజేరు జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి స్కూటీని బైక్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న అల్లాడ ఆనంద్ తుళ్లి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీని నడుపుతున్న కుమార్‌రాజాకు, మోటార్ బైక్ నడుపుతున్న దాసరి నారాయణరావుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిద్దరిని 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎస్సై సాయి కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన కృష్ణ మూర్తి (ఫైల్)

పార్వతీపురం టౌన్: సీతానగరం మండలం గెద్దలుప్పి గ్రామానికి చెందిన బొంగలి కృష్ణ మూర్తి చాలాకాలంగా మెడ, రెండుభుజాల నొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం నొప్పిని భరించలేక గడ్డిమందు తాగేసి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

చిచ్చు రేపిన డీలర్ ఉద్యోగం

- జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య కొట్లాట
- ఆస్పత్రిలో చేరిన క్షతగాత్రులు



ఆస్పత్రిలో చేతికి కట్టుతో టీడీపీ కార్యకర్త మక్కువ సత్యం అప్పలరాజు

నెల్లిమర్ల రూరల్: ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా అలజడి రేగింది. జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య చెలరేగిన ఘర్షణ చినికి చినికి గాలివానలా మారి అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. దీంతో గ్రామంలో ఏం జరుగుతోందో తెలియక ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. అసలు తగాదాలకు చోటే లేని గ్రామంలో రాజకీయ అశాంతి నెలకొనడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చూడలేదంటూ ముక్కున వేలేసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలంలోని పెద్ద బూరాడపేట గ్రామంలో టీడీపీకి చెందిన రేకపాటి వెంకట పాపారావు కుటుంబసభ్యులు గత 40 ఏళ్లగా రేషన్ షాపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల రేషన్ షాపు డీలర్ పోస్టుకు నోటిఫికేషన్ ఇవ్వడంతో జనసేన నాయకుడు మక్కువ హరి సతీమణి కుమారిని డీలర్‌గా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామంలో 'గుడ్ మార్నింగ్ జనసేన' కార్యక్రమం పేరిట ఆదివారం పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మరీ గ్రామంలోని రచ్చబండ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జనసేన నాయకులను డీలర్ పోస్టు విషయమై టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పటి నుంచి డీలర్‌గా తమ పార్టీకి చెందినవారే వ్యవహరిస్తున్నారని తమను కాదని నిన్నమొన్న వచ్చిన జనసేన నాయకుడికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీంతో తాము ఏది చెబితే అదే జరుగుతుందని జనసేన నాయకులు బదులివ్వడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. క్షణాల్లో ఒకరిపై ఒకరు చేయి చేసుకుని కొట్లాడుకున్నారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్త మక్కువ సత్యం అప్పలరాజు చేయి విరిగిపోవడంతో నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అసలు జనసేన ఉనికి లేకపోయినప్పటికీ ఎంతో శ్రమించి పార్టీ విజయనాకి సహకరించామని తమపై దాడికి పాల్పడి మనోభావాలు దెబ్బతీశారంటూ టీడీపీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెనుగులాటలో పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు.



పెద్ద బూరాడపేటలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై గణేష్



పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జనసేన నాయకులు

పోలీస్ పికెట్ ఏర్పాటు

గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగడంతో స్థానిక ఎస్సై గణేష్ హుటాహుటిన గ్రామానికి వెళ్లారు. సీఐ రామకృష్ణ గ్రామాన్ని సాయంత్రం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి తగాదాకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కాగా ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చర్చలు కొనసాగుతున్నాయి.

'చీకటి పువ్వు'కు ప్రథమ బహుమతి

- ద్వితీయ బహుమతి దక్కించుకున్న కొత్త పరిమళం
- ఘనంగా ముగిసిన నాటక పోటీలు



ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో మూడు రోజులపాటు జరిగిన ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటికకు లభించింది. కాగా తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం తెలుగు కళా సమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక నిలిచింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు. అవనాపు సత్యనారాయణ, గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు

ఉత్తమ దర్శకుడు బహుమతి మంచాల రమేష్ (చీకటి పువ్వు), ఉత్తమ రచయిత బహుమతి కేకే ఎల్ స్వామి (కొత్త పరిమళం), ఉత్తమ నటుడు బహుమతి పి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత)కు లభించాయి. ద్వితీయ ఉత్తమ నటుడుగా డి.గిరిబాబు (చీకటి పువ్వు), ఉత్తమ నటిగా జి.లహరి (చీకటి పువ్వు) ద్వితీయ ఉత్తమ నటిగా డి.హేమ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత)ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా రాంబాబు (నిశ్శబ్దమా నీ ఐరీదెంత), ఉత్తమ సహాయ నటుడుగా శోభన్ బాబు(కొత్త పరిమళం) ఉత్తమ విలన్‌గా దలం (కొత్త పరిమళం), ఉత్తమ హాస్యనటుడిగా బి.కన్నబాబు (నిశ్శబ్దమానీ ఖరీదెంత)కు బహుమతులు లభించాయి. ఉత్తమ రంగాలంకరణ రమణ (కొత్త పరిమళం), ఉత్తను సంగీతం లీల -మోహన్ (చీకటి పువ్వు), ఉత్తమ ఆహార్యం రమణ (కొత్త పరిమళం) జ్యూరీ బహుమతులు సత్యనారాయణ (దేవరాగం), డి.రాధాకృష్ణ (ఎడా రిలో వాన చినుకు) భుజంగరావు (రైతే రాజు)కు లభించాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కుసుమాల నాగభూషణం, కేవీ మంగారావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, ఎంఎం నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, తుమ్ము వెంకటరమణ, జనాప్రసాద్, మద్దిల సన్యాసిరావు, కాళ్ల రాజశేఖర్, డొంక కష్ణ, మద్దిల వాసు, ముత్యాల నాయుడు, కనకల హైమావతి నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఈపు విజయకుమార్, ఆరిపాక శ్రీనివాసరావు,ఆరిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చండీయాగం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తిలు అమ్మవారి చండీయాగ ప్రక్రియను చేశారు. అనంతరం యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా సిరిమాను చెట్టు ఊరేగింపు



పట్టణంలో జరుగుతున్న అమ్మవారి సిరిమాను చెట్టు ఊరేగింపు



ఆకట్టుకున్న బళ్ల వేషాలు

సాలూరు: సాలూరు పట్టణంలో మే నెలలో జరగనున్న శ్రీ శ్యామలాంబ తల్లి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో కీలకమైన అమ్మవారి సిరిమాను చెట్టు ఊరేగింపు కనుల పండువగా జరిగింది. సుమారు 50 జతల ఎద్దులు, 2 ట్రాక్టర్‌లతో వేలాదిమంది భక్తులు తరలిరాగా పురవీధుల్లో అమ్మవారి సిరిమాను ఊరేగింపు వేడుకగా జరిగింది. దారిపొడవునా భక్తులు ముగ్గురాటలు, పసుపు కుంకుమలు సిరిమానుపై వేసి పూజలు చేశారు. ఎడ్ల బండ్లు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తూ, అంతరించిపోతున్న నాటి సంప్రదాయం మళ్లీ గుర్తుకువచ్చేలా చేశాయి. పులివేషాలు, తీన్మార్, సన్నాయి మేళం నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

డ్రోన్స్, సీసీ కెమెరాలతో నిఘా



రద్దీ ప్రాంతాల్లో డ్రోన్స్‌తో నిఘా పెట్టిన పోలీస్ శాఖ

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: డ్రోన్స్, సీసీ కెమెరా నిఘాతో నేరాల కట్టడి, నియంత్రణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా పట్టణాల్లో జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ ఐడీ పార్టీలతో పాటు డ్రోన్స్‌ను వినియోగించడం ప్రారంభించింది. ప్రస్తుతం విజయనగరంలో మూడు డ్రోన్ కెమెరాలతో పాటు కొత్తగా సీసీ కెమెరాలను కూడా వినియోగించేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. ఇదే విషయాన్ని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. జిల్లా కేంద్రంతో పాటు మూడు సబ్ డివిజన్‌లైన బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరం పరిధిలో పండగలు, ఉత్సవాలు, ర్యాలీలు వంటి బహిరంగ కార్యక్రమాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా డ్రోన్స్ వినియోగిస్తున్నట్టు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం ఉన్న మూడు డ్రోన్స్‌తో పాటు సీసీ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు.ఈ మూడు సబ్ డివిజన్‌ల పరిధిలో అన్ని సంస్థలు, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఆయా సంస్థల ప్రతినిధులతో సీసీ కెమారాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే రహదారి ప్రమాదాలు అరికట్టేందుకు, ఈవ్‌టీజింగ్ నియంత్రణ, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా ఉండేందుకు డ్రోన్స్ వాడుతున్నామన్నారు. ఇక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తద్వారా అసలు ప్రమాదాలే జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రోన్స్‌తో పాటు సీసీ కెమెరాలను సంబంధిత సంస్థలు, ప్రతినిధులతో కొనుగోలు చేయించి అమర్చుతున్నామని ఎస్పీ వకుల్ ఈ సందర్భంగా అన్నారు. ఈ తరహాలోనే జనవరి, ఫిబ్రవరి నెలల్లో బహిరంగంగా మద్యం తాగిన వారిని గుర్తించామని చెప్పారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడిపిన వారిని గుర్తించి దాదాపు 4,300 కేసులు కేసులునమోదు చేశామని తెలిపారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన అనవసరం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ఉదంతులు, అపోహాలు నమ్మవద్దని, ఏ ఒక్కరూ భయపడాల్సిన పనిలేదని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బర్డ్‌ఫ్లూ నియంత్రణపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బర్డ్‌ఫ్లూ పక్షులకు మాత్రమే వస్తుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని స్పష్టం చేశారు. బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి మాత్రమే కాకుండా వైరస్‌వ్యాప్తిని అడ్డుకోవడానికి పలు జాగ్రత్తలు అవసరమని తెలిపారు. ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు వచ్చిన వెంటనే వైద్యసిబ్బందికి తెలియజేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇంటింటి నిఘా కోసం ఆశ కార్యర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఎంఎన్ఓలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కోడుగుడ్లు, చికెన్ వినియోగానికి ముందు శుభ్రం చేసుకోవడంతో పాటు వంటకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 160 డిగ్రీల వద్ద వేడిచేసి తినాలని సూచించారు.

సెంచూరియన్‌లో ముగిసిన గజజ్యోతి వేడుకలు

- విద్యార్థులను ఉర్రూతలూగించిన గాయకుడు రేవంత్



పాటలు పాడుతున్న ప్రముఖ గాయకుడు రేవంత్



తిలకిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో గజజ్యోతి వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ప్రముఖ పాప్ సింగర్ రేవంత్ ముగింపు వేడుకలకు హాజరై తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించాడు. పలు సినీ గీతాలను ఉత్సాహంగా ఆలపించడంతో యువతీ, యువకులు డ్యాన్సులు చేసి సందడి చేశారు. అనంతరం వర్సిటీ విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు, వీసీ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	170

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బొబ్బిలి రూరల్: దత్తిరాజేరు మండలం విజయరాంపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా వెనుకనుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఆదివారం మండలంలోని రంగరాయపురం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో విజయరాంపురానికి చెందిన గౌరి ఆమె కుమారుడు సునీల్ కుమార్‌లు గాయపడగా వారిని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందజేశారు.

రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తికి..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఒక రైలు బదులు పొరపాటున మరో రైలు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి దూబ అప్పన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 ఈఎంటి జయముని, పైలట్ సీహెచ్.తవిటినాయుడులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళికి చెందిన దూబ అప్పన్న చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో హౌరా-చెన్నయ్ మెయిల్ ఎక్కి తరువాత తాను ఎక్కాల్సిన రైలు కాదని తెలుసుకుని దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలు ఇరుక్కుపోయింది. ఇంతలోనే రైలు కదలడంతో కుడి కాలు మొత్తం నుజ్జునుజ్జయ్యింది.

అలరించిన సంగీత విభావరి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 67వ వార్షికోత్సవం పురస్కరించుకుని బండారు చిట్టిబాబు పర్యవేక్షణలో బండారు రమణమూర్తి సంగీత దర్శకత్వంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన లలిత సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వేణువుపై వెల్లంకి కూర్మనాథం, కీబోర్డుపై సోమేష్, ప్యాడ్స్‌పై బాబూరావు, తబలాపై రమణమూర్తి సహకరించారు. వ్యాఖ్యాతగా మండా వెంకట కామేశ్వరరావు, గాయకులు సాయి ప్రశాంతి, శ్రీవిద్య, శారద, శైలజ, పావని, భాస్కర్ తమవంతు సహకారం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కాళ్ల నిర్మల, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ముచ్చటైన అక్షరాలు.. మెరుగైన ఫలితాలు..

- అందమైన చేతిరాతతో శతశాతం మార్కులకు అవకాశం
- పది, ఇంటర్ విద్యార్థులు దస్తూరిపై దృష్టి సారించాల్సిందే


విజయనగరం: సరైన సమాధానం రాసినా.. పేపరు దిద్దేవారికి అర్థమైనప్పుడే నూరు శాతం మార్కుల సాధనకు అవకాశం ఉంటుంది. ఇందుకు చక్కటి దస్తూరి కొంతవరకు దోహదపడుతుంది. ఎంత బాగా చదివి, రాసినా దస్తూరీ అర్థం కాకుంటే సమాధాన పత్రాలను దిద్దేవారికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. ఆ ప్రభావం మార్కులపై పడుతుంది. అందమైన చేతిరాత విద్యార్థుల భవితను నిర్దేశిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు గజిబిజిగా కాకుండా అర్థమయ్యేలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు . కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చేతిరాతపై పట్టు సాధించవచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు. త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తున్నారు. కొట్టివేతలు లేకుండా, చక్కగా రాసే అలవాటు చేసుకోవాలి.

తలరాతను మారుస్తుంది..

విషయం ఏదైనా ముత్యాలు వంటి అక్షరాలను చూస్తే చదవాలనిపిస్తుంది. సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా చేతిరాత ప్రాధాన్యం ఎన్నటికీ తగ్గదు. మెరుగైన చేతిరాతతో వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసుకోవచ్చు. అందమైన దస్తూరి ద్వారానే భావాన్ని వ్యక్తీకరించగలం. ఉపాధ్యాయుడు ఏ అక్షరం వద్ద విద్యార్థి తప్పు రాస్తున్నాడో గుర్తించి సరిచేస్తే, విద్యార్థి మళ్లీ ఆ తప్పు చేయడు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా చేతి రాత మెరుగుపరచుకోవడం ఏమంత కష్టం కాదు.

చేతిరాతలో ఈ అంశాలు ముఖ్యం

- ముఖ్యంగా అక్షరాల పరిమాణం ఒకేలా ఉండేటట్లు చూసుకోవాలి.
- అక్షరాలు, పదాల మధ్య సమాన దూరం ఉండాలి.
- అక్షరాలను ఒకే గీతపై వరుసుగా ఉండేలా చూసుకోవాలి.
- తప్పుల్లేని విధంగా ఒత్తులను సరిగా వినియోగిస్తూ రాయాలి.
- కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకూడదు. ఇవి చూసే వారికి, సమాధాన పత్రం దిద్దేవారికి ఇబ్బందిగా అనిపించే అవకాశం ఉంది.
- సాధనతో వేగంతో కూడిన రాతకు ప్రయత్నించాలి.



ఈ విధమైన చేతిరాతతో అధిక మార్కులకు అవకాశం

శిక్షణ ఇస్తున్నాం..

పదో తరగతి విద్యార్థులు అందమైన దస్తూరితో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఎంత చదివినా, సమాధానం ఎంత బాగా రాసినా విషయం ఉపాధ్యాయుడికి అర్థం కాకపోతే తగిన మార్కులు సాధించడం కష్టం. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు దస్తూరిపై శిక్షణ ఇస్తున్నాం..

– ఎం.మురళీధరరావు, ఉపాధ్యాయుడు